ప్రజాశక్తి
శుక్రవారం 19 జనవరి 2024

ఎంప్లాయిమెంట్ సేవలు ఇక ఆన్‌లైన్‌లో..

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలో అన్ని జిల్లాల ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీల ద్వారా అందుతున్న సేవలన్నింటినీ భారత ప్రభుత్వ నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సిఎస్) పోర్టల్‌తో ఆన్‌లైన్‌లో అనుసంధానించినట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతలు నమోదు సులభ రీతిన http://employment.ap.gov.in ద్వారా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేస్తే వారికి లాగిన్ వివరాలు, తాత్కాలిక రిజిస్ట్రేషన్ నెంబర్ వెంటనే మెసేజ్ ద్వారా పంపిస్తారని చెప్పారు. సంబంధిత జిల్లా అధికారి వారి అభ్యర్ధనను ఆమోదించిన తర్వాత వారికి మెసేజ్ ద్వారా రిజిస్ట్రేషన్ నెంబర్ తెలియజేస్తారని తెలిపారు. అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ కార్డును లాగిన్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. సందేహాలకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఫోన్ నంబర్ 96407 60352ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కులగణన

ఇంటింటికీ సచివాలయ సిబ్బంది ● వివరాల వెల్లడి స్వచ్ఛందమే ● సమాచార గోప్యత ప్రభుత్వానిదే



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో కులగణన ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రతి సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి కులగణన చేస్తారు. దీని కోసం రూపొందించిన ప్రత్యేక యాప్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 28 వరకు పది రోజులపాటు మొబైల్ యాప్ ద్వారా డోర్ టూ డోర్ సర్వే నిర్వహిస్తారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ, ప్లానింగ్, సంక్షేమ శాఖల నుంచి ఎంపిక చేసిన సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు, డివిజన్, జిల్లా అధికారులు ఈ సర్వేను పర్యవేక్షిస్తారు. జిల్లా స్థాయిలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనారిటీ సంక్షేమ అధికారులు పర్యవేక్షిస్తారు. కులగణన, నమోదు ప్రక్రియ, విధి విధానాలు తదితర అంశాలపై గ్రామ, మండల స్థాయితోపాటు జిల్లా స్థాయిలో, జోనల్ స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు కొద్దిరోజుల క్రితం ముగిశాయి. ఇప్పటికే రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లోని ఏడు సచివాలయాల పరిధిలో కులగణన పైలట్ ప్రాజెక్టులను నిర్వహించింది. ఆయా అనుభవాలతో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టేందుకు యంత్రాంగం సమాయత్తమైంది.

కులగణన ప్రక్రియలో వ్యక్తులు తమ వివరాలను స్వచ్ఛందంగానే వెల్లడించాల్సి ఉంటుంది. కులం వివరాలను చెప్పడానికి ఇష్టం లేనివారి కోసం నో కేస్ట్ కేటగిరీ కూడా అందుబాటులో ఉంటుంది. వివరాల కోసం ఎవరినీ బలవంత పెట్టే పరిస్థితి ఉండదని అధికారులు చెబుతున్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు గానీ, ఇతర ఆధారాలు గానీ సమర్పించాల్సిన అవసరం లేదు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటల్లో ఎవరి కులం వారికే నమోదు చేస్తారు. వివరాలను ధ్రువీకరిస్తూ కుటుంబంలో ఎవరో ఒకరు బయోమెట్రిక్ వేసి నిర్ధారించాల్సి ఉంటుంది. సేకరించిన వివరాలను పూర్తి గోప్యంగా, భద్రంగా ఉంచుతామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. కులగణన ద్వారా ఆయా తరగతుల అభివృద్ధికి అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేయడానికి వీలు కలుగుతుందని ప్రభుత్వం చెప్తోంది. ముఖ్యంగా వివిధ కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, వారి విద్య, జన సంఖ్య తెలుసుకొని, వారికి ప్రయోజనాన్ని చేకూర్చడానికి ఈ సర్వే ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

సర్వేలో సేకరించే వివరాలు

- కుటుంబం అందుబాటులో ఉన్నారా / మరణించారా / శాశ్వతంగా వలస వెళ్లారా?.
- జిల్లా, జిల్లా కోడ్, మండలం/మున్సిపాలిటీ, గ్రామం, పంచాయతీ, పంచాయతీ కోడ్ , వార్డు నంబర్, ఇంటి నంబర్.
- కుటుంబ పెద్ద పేరు, ఆధార్, రేషన్ నంబర్లు, కుటుంబ సభ్యుల సంఖ్య, పేర్లు, కుటుంబ పెద్దతో సంబంధం.
- కుటుంబం నివాసం ఉంటున్న ఇల్లు.
- ప్రస్తుతం ఉన్న చిరునామా.
- మరుగుదొడ్డి సౌకర్యం ఉందా లేదా.?
- మంచి నీరు/ తాగునీరు సదుపాయం ఉందా.? (వీధి కుళాయి, బోర్‌వెల్, పబ్లిక్ బోర్ వెల్, సొంత కుళాయి)
- పశు సంపద ఏమైనా కలిగి ఉన్నారా?.
- వంట చేసే విధానం (ఎల్‌పిజి గ్యాస్, కిరోసిన్, కట్టెలు).

కుటుంబ సభ్యుల వివరాలు

- కుటుంబ సభ్యుని పేరు, తండ్రి పేరు, జెండర్, పుట్టిన తేది, వైవాహిక స్థితి, కులం, ఉప కులం, మతం, విద్యార్హత, ప్రస్తుతం చేస్తున్న వృత్తి.
- వ్యవసాయ భూమి వివరాలు.
- నివాస స్థలం వివరాలు.

కులగణన షెడ్యుల్

- జనవరి 19 నుంచి 28 : ఇంటింటి సర్వే
- జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 : మిగిలిపోయిన ఇళ్లు, వ్యక్తుల వివరాల సేకరణ
- ఫిబ్రవరి 15 వరకు : సచివాలయ స్థాయిలో డేటా క్రోడీకరణ, ఖరారు.

పకడ్బందీగా కులగణన

ప్రజల సామాజిక స్థితిగతులను తెలుసుకోవడం కోసం కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ఈ సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ విధాన నిర్ణయాలను రూపొందించడానికి, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ఈ సర్వే వివరాలు దోహదపడతాయి. తద్వారా బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల వారికి మరింత మేలు జరుగుతుంది. ఈ సర్వే పూర్తిగా స్వచ్ఛందం. సేకరించిన సమాచారం ప్రభుత్వం వద్ద భద్రంగా ఉంటుంది.

- కలెక్టర్ నాగలక్ష్మి

ఎమ్మెల్యేల్లో ధీమా.. ఎమ్‌పిపై డైలమా..!



తమకు మరోసారి సీటు గ్యారెంటీ అన్న ధీమా ఉమ్మడి విజయనగరం జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో వ్యక్తమౌతోంది. బయట కూడా అదే రకమైన చర్చ నడుస్తోంది. విజయనగరం ఎమ్‌పి సీటు తిరిగి బెల్లానకు కేటాయించే విషయంలో మాత్రం ఇంకా డైలమా కొనసాగుతోంది. జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)కు దాదాపు ఖరారైందని ఆయన అనుయాయులు చెప్తుండగా, ఎమ్‌పిగా పోటీ చేసేందుకు ఆయన అంత ఆసక్తికరంగా లేరని కొందరు చెప్తున్నారు. మరోవైపు సిట్టింగ్ ఎమ్‌పి బెల్లాన కూడా ఈసారి కూడా ఎమ్‌పి టికెట్ తనకేనని ఒకింత ధీమా వ్యక్తం చేస్తున్నారు.

● బెల్లానను తప్పిస్తే జెడ్‌పి పీఠం కట్టబెడతారని చర్చ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా సిట్టింగుల్లో గుబులు మొదలై పక్షం రోజులు గడుస్తున్నప్పటికీ విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో మాత్రం అటువంటి పరిణామాలు చోటుచేసుకునే పరిస్థితి లేదని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును ఈసారి అక్కడి నుంచి తప్పించినప్పటికీ అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నుంచి అవకాశం కల్పించారు. అటు ప్రభుత్వంలోనూ, ఇటు వైసిపిలోనూ కీలకంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ రెండు జిల్లాలకు చెందిన ఎమ్‌పి, ఎమ్మెల్యేలను మార్చాల్సిన అవసరం లేదని అధిష్టానానికి చెప్పినట్టు, గెలిపించే బాధ్యత తాను చూసుకుంటానని భరోసా ఇచ్చినట్టు చర్చనడుస్తోంది. మరోవైపు జిల్లా పార్టీని సమన్వయం చేస్తున్న చిన్న శ్రీను కూడా ఈసారి చట్టసభల్లోకి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈనేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు యథాతథంగా కొనసాగితే ఈ రెండు జిల్లాల్లో ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం ఆయనకు దక్కే పరిస్థితి లేదు. రాజాం ఖాళీ అయినప్పటికీ అక్కడ రిజర్వేషన్ అనుకూలించదు. ఈ నేపథ్యంలోనే చిన్న శ్రీనును అధిష్టానం ఎమ్‌పిగా పంపేందుకు ఆలోచన చేస్తోందని చర్చనడుస్తోంది. ఆయనకు ఎమ్‌పిగా అవకాశం కల్పిస్తే సిట్టింగ్ ఎమ్‌పి బెల్లాన భవితవ్యం ఏమిటనేది ప్రశ్నగా మారింది. జిల్లాను ముందుకు నడపడంలో చిన్న శ్రీను ఎంతో, చీపురుపల్లి నియోజకవర్గంలో మంత్రి బొత్స గెలుపులో బెల్లాన కూడా అంతేనని పలువురు విశ్లేషిస్తున్నారు. ఈనేపథ్యంలో బెల్లానకు స్పష్టమైన హామీ ఉంటే తప్ప ఎన్నికల్లో మనసుపెట్టి పనిచేసే అవకాశం లేదని, అదే జరిగితే బొత్సకు కొంత ఇబ్బంది ఏర్పడుతుందని ఊహాగానాలు వ్యక్తమౌతున్నాయి.

ఈ నేపథ్యంలో చిన్న శ్రీనుకు ఎమ్‌పి సీటు ఇస్తే, ప్రస్తుతం ఆయన కూర్చున్న జెడ్‌పి చైర్మన్ పీఠం కట్టబెడతామని బెల్లానకు నచ్చజెప్పే పరిస్థితి వస్తుందని, ఆ దిశగా ఆలోచన, చర్చలు కూడా నడుస్తున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అందువల్లే ఉత్తరాంధ్రలో ఎమ్‌పి అభ్యర్థుల జాబితా మొత్తం ప్రకటించినప్పటికీ విజయనగరం అభ్యర్థిని బయట పెట్టలేదని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఎమ్‌పి సీటు ఇచ్చినంత మాత్రాన ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆయువుపట్టులాంటి జెడ్‌పి సీటును చిన్న శ్రీను వదులుకునే పరిస్థితి ఉండదని కూడా చర్చనడుస్తోంది. ఈ నేపథ్యంలో విజయనగరం ఎమ్‌పి సీటు ఎవరికనేది మంత్రి బొత్స వ్యూహం, చిన్న శ్రీను ఆలోచన, ఆసక్తిపై ఆధారపడి ఉంటుంది.

22న ఓటర్ల తుది జాబితా

జిల్లా పరిశీలకులు జె.శ్యామలరావు ● సవరణ ప్రక్రియపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిశీలకులు శ్యామలరావు

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 22న ఓటర్ల తుదిజాబితా ప్రకటనకు సిద్ధం కావాలని జిల్లా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పరిశీలకులు, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు.. అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం జిల్లాలో పర్యటించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న సవరణ ప్రక్రియను కలెక్టర్ నాగలక్ష్మి ముందుగా వివరించారు. వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా పరిశీలకులు శ్యామలరావు మాట్లడుతూ సవరణ ప్రక్రియపై నియోజకవర్గాల వారీగా ఆరా తీశారు. ప్రస్తుత పరిస్థితి, రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలను తెలుసుకున్నారు. వచ్చిన అన్ని ఫిర్యాదులను పరిశీలించి, తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాల తుది ప్రచురణకు చేసిన ఏర్పాట్లను తెలుసుకున్నారు. నాలుగు కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలున్న ప్రదేశాలు, అక్కడి మౌలిక సదుపాయాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. 22న తుది జాబితాను ప్రచురించి, అన్ని పోలింగ్ కేంద్రాల్లో జాబితాలను ప్రదర్శించాలని ఆదేశించారు. జాబితాలను గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీలకు ఇవ్వడంతోపాటు డిజిటల్ కాపీలను కూడా ఆన్‌లైన్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతీ బిఎల్ఒ వద్దా ఓటర్ల జాబితా ఉండాలని, పబ్లికేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఇవ్వాలని శ్యామలరావు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, నియోజకవర్గాల ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు, డిటిలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు జెఎఎస్

విజయనగరం టౌన్ : ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తుందని కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు అన్నారు. గురువారం దాసన్నపేట సచివాలయంలో, పూల్‌బాగ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. వాలంటీర్ల సర్వే మందుకొడిగా సాగడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. పూల్‌బాగ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వాలంటీర్ల సర్వే సరిగా చేపట్టకపోవడంతో అడ్మిన్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వాలంటీర్లు కూడా అప్పగించిన పనిని నిర్లక్ష్యం వహిస్తున్నారన్న రీతిలో మండిపడ్డారు. అనంతరం ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఉచితంగా అందజేస్తున్న మందులు పంపిణీ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జీతం పెంచి సమ్మె విరమింపజేయండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు ● షోకాజ్ నోటీసులకు సమాధానాలు పంపిన అంగన్వాడీలు ● 38వ రోజుకు నిరవధిక సమ్మె

శృంగవరపుకోట.. అంగన్వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం పట్టుదలకు పోకుండా అంగన్వాడీలకు జీతం ఎంత పెంచుతారో చెప్పి సమ్మెను విరమింపచేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 38వ రోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలని కలెక్టరేట్ నుంచి అయ్యన్నపేటలోని ఐసిడిఎస్ కార్యాలయం వరకు అంగన్వాడీలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం షోకాజ్ నోటీసులకు సమాధానాలు ఇచ్చారు. అంతకుముందు సమ్మె శిబిరాన్ని వెంకటేశ్వరరావు సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు న్యాయమైన సమస్యలపై సమ్మె చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలని చూడకుండా ఎస్మా చట్టాన్ని ప్రయోగించిందని, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని నోటీసులు ఇచ్చిందని ధ్వజమెత్తారు. జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ.. అంగన్వాడీల ఉద్యమాన్ని వెనకుండి ఎవరో నడిపిస్తున్నారని ప్రకటించడంపై తీవ్రంగా మండిపడ్డారు. అధికారంలో ఉండి బాధ్యతారహితంగా మాట్లాడవద్దని హితవు పలికారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ఉద్యమాల వద్దకు వచ్చి మద్దతు తెలియజేయలేదా? అని ప్రశ్నించారు. అంగన్వాడీలు కడుపు మండి ఉద్యమిస్తున్నారు తప్ప ఏ ఒక్క రాజకీయ పార్టీకి కొమ్ము కాయడం లేదని స్పష్టంచేశారు. జీతం పెంచి, సమ్మెను విరమింపజేయాలని, లేకుంటే వామపక్ష, కలిసి వచ్చే ప్రతిపక్ష పార్టీలతో రాష్ట్ర బంద్‌కు సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఉపాధ్యక్షులు బి.సుధారాణి, కార్యదర్శి ఎ.జగన్ మోహన్ రావు, యూనియన్ జిల్లా అధ్యక్షులు బి పైడ్రాజు నాయకులు ప్రభ, శివ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు సందర్శించి, మద్దతు తెలిపారు. ఐసిడిఎస్ పిఒ ఉమకు అంగన్వాడీలు షోకాజ్ నోటీసులకు సమాధానాలు రాసిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.శ్యామల, కెవి లక్ష్మి, వి.మాణిక్యం, కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : స్థానిక బ్రిడ్జి కూడలి నుంచి ఐసిడిఎస్ కార్యాలయం వరకు అంగన్వాడీలు ర్యాలీ చేపట్టారు. అనంతరం షోకాజ్ నోటీసులకు అంగన్వాడీలు మూకుమ్మడిగా సమాధానం రాసి, ఐసిడిఎస్ పిఒకు అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్షులు సుభాషిణి, సెక్టార్ లీడర్లు నారాయణమ్మ, రాములమ్మ, వాణి, పి.పద్మ, ఆర్.దమయంతి, సుజాత, జ్యోతి, నాగమణి,తదితరులు పాల్గొన్నారు.

గుర్ల : మండలంలోని గూడెం కూడలి నుంచి సిడిపిఒ కార్యాలయం వరకు అంగన్వాడీలు ర్యాలీ చేపట్టారు. అనంతరం షోకాజ్ నోటీసులకు అంగన్వాడీలు సమాధానాలు రాసి, సిడిపిఒ ఆరుద్రకు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు టివి రమణ, అంబళ్ల గౌరినాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు వరలక్ష్మి పాల్గొన్నారు.

బొబ్బిలి : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు షోకాజ్ నోటీసులతో ధర్నా చేపట్టారు. అనంతరం సామూహికంగా సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కామేశ్వరి, నిర్మల, పద్మ పాల్గొన్నారు.

భోగాపురం : భోగాపురం ప్రాజెక్టు పరిధిలోని సెక్టార్ లీడర్లు షోకాజ్ నోటీసులను సిడిపిఒ కార్యాలయానికి గురువారం అందజేశారు. వీరికి సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ మద్దతు తెలిపారు.

బొబ్బిలి ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ఆర్‌టిసి కాంప్లెక్సులో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

కొనసాగుతున్న రద్దీ

బస్సులు లేక నిరీక్షణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

సంక్రాంతి పండగకు వచ్చిన వారు తిరుగుముఖం పట్టడంతో ఆర్‌టిసి కాంప్లెక్సులో రద్దీ కొనసాగుతోంది. సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు రిజర్వేషన్ కౌంటర్ వద్ద గురువారం ప్రయాణికులు బారులు తీరారు. ప్రయాణికులకు తగ్గట్టుగా బస్సులు లేకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. పిల్లాపాపలతో, లగేజీలతో బస్సులు ఎక్కేందుకు నానా అవస్థలు పడుతున్నారు. బస్సులు తక్కువగా ఉండడంతో ఏ బస్సు ఎప్పటికి వస్తుందో తెలియక ప్రయాణికులు ఎదురు చూడక తప్పలేదు.

కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 20 నుంచి 22 వరకు నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌కు జిల్లా బాలికల జట్టును గురువారం ఎంపిక చేశారు. స్థానిక సిటీ క్లబ్‌లో జరిగిన ఎంపికకు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో బాలికలు హాజరయ్యారు. వారిలో 14 మందితో కూడిన జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు రంగారావు, కార్యదర్శి ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యనారాయణ, గోపాల్, శ్రీను, శివ, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. రాష్ట్రంలోని ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వడ్డీ రాయితీ జమ చేశారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా జిల్లాలోని సుమారు 29,686 మంది లబ్ధిదారులకు రూ.3.01 కోట్ల వడ్డీ రాయితీని జమ చేశారు. దీనికి సంబంధించిన చెక్కును లబ్ధిదారులకు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొదుపు సంఘాల ద్వారా ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.35 వేలు రుణంగా మంజూరు చేసిందన్నారు. వారికి వడ్డీ రాయితీ కింద జిల్లాలో రూ.3.01 కోట్లను సుమారు 29,686 మందికి జమ చేసినట్లు తెలిపారు. ఇళ్లను పూర్తి చేయడానికి లబ్దిదారులకు ప్రభుత్వం పలు రాయితీలను ఇస్తోందని చెప్పారు. ఉచితంగా ఇసుకను, సబ్సిడీ ధరపై సిమెంటు, ఐరన్ కూడా సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇచ్చిన రుణాలకు వడ్డీ రాయితీని కూడా ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. వీటన్నిటినీ ఉపయోగించుకొని లబ్దిదారులు తమ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాని కోరారు. ఇప్పటికే కాలనీల్లో తాగునీరు, విద్యుత్తు లాంటి కనీస సదుపాయాలను కల్పించామని, ఇళ్ల నిర్మాణం పూర్తి అయితే ఇతర మౌలిక వసతులను కల్పిస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహాలకు పాలాభిషేకం

విజయనగరం టౌన్ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారీ విగ్రహాన్ని శుక్రవారం సిఎం జగన్ ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహించాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో వైసిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. సచివాలయ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో కూడా పెద్ద ఎత్తున పాలాభిషేకాలు నిర్వహించాలని, ఈ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

జోన్-1 చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా అప్పలనాయుడు

విజయనగరం కోట : ఎపిఎస్ ఆర్‌టిసి జోన్-1 చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా బి.అప్పలనాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిప్యూటీ సిపిఎం సుధా బిందు, డ్రైవర్లు, కార్మికులు శుభాకాంక్షలు తెలిపారు.

విజయనగరం రూరల్ సిఐ తిరుపతిరావు బదిలీ

విజయనగరం : విజయనగరం రూరల్ సిఐ టి.వి.తిరుపతిరావు ఆనందపురం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు విశాఖపట్నం సిపి రవిశంకర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సృజనాత్మకంగా శకటాలు

విజయనగరం : స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో ఈ నెల 26న జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించే గణతంత్ర వేడుకల్లో ఏడాది కాలంలో జిల్లా సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రతి ఏటా నిర్వహించే తరహాలోనే ప్రభుత్వ శాఖల ప్రగతిపై ఆయా శాఖల ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించాలని, వాటిని సృజనాత్మకంగా, చూపరులను ఆకట్టుకొనే విధంగా రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ఏడాది కాలంలో ప్రభుత్వం కొత్తగా చేపట్టిన జగనన్న సురక్ష, ఆరోగ్య సురక్ష, ఆడుదాం ఆంధ్ర, తదితర కార్యక్రమాలపై సమాచారంతో స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలన్నారు.

మహనీయుడు ఎన్‌టిఆర్

ఘన నివాళులర్పించిన కేంద్రమాజీ మంత్రి అశోక్

ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అశోక్, టిడిపి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టి, వారి అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేసిన నందమూరి తారక రామారావు మహనీయుడని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు కొనియాడారు. అటువంటి వారిని గౌరవించుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. ఎన్‌టిఆర్ వర్థంతి సందర్భంగా గురువారం నగరంలోని కోట, కలెక్టరేట్ జంక్షన్లలో ఎన్‌టిఆర్ విగ్రహాలకు అశోక్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లోనూ మాతృభాషను పరిరక్షించుకుంటున్నాయని, కానీ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం తెలుగును నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రభుత్వాలుంటే మన రాష్ట్రంలో మాత్రమే నిరక్షరాస్యులు ఉంటారని చెప్పారు. పేదలకు విద్యను దూరం చేసేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కనకమహాలక్ష్మి, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్‌బాబు పాల్గొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే మీసాల గీత పూలమాల వేసి నివాళులర్పించారు.

విజయనగరం టౌన్ : కార్పొరేషన్ కార్యాలయం వద్దనున్న ఎన్‌టిఆర్ విగ్రహానికి జనసేన నేత గురాన అయ్యలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని నిరాశ్రయుల వసతిగృహంలో వృద్ధులకు స్వీట్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు డి.రామచంద్రరాజు, ఎ.వెంకటేష్ నాయుడు, టి.రామకృష్ణ, ఏంటి రాజేష్, రంగూరి భరత్, ఎం.పవన్ కుమార్, పిడుగు సతీష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరుతున్న గద్దె బాబూరావు

టిడిపిలోకి మాజీ ఎమ్మెల్యే గద్దె

ప్రజాశక్తి- విజయనగరం కోట

మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు సొంత గూటికి చేరారు. గురువారం అమరావతి టిడిపి కార్యాలయంలో చంద్రబాబు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

టిడిపిలోకి మాజీ ఎమ్మెల్యే కుమారుడు

మాజీ ఎమ్మెల్యే కోట్ల సన్యాసప్పలనాయుడు కుమారుడు కోట్ల సుగుణాకర్ రావు టిడిపిలో చేరారు. మంగళగిరిలో చంద్రబాబు సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా వయోజన విద్యా శాఖలో డిప్యూటి డైరెక్టర్‌గా పని చేసి స్వచ్ఛంద పదవి విరమణ చేసిన కోట్ల సుగుణాకర్ రావు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజ రాపు అచ్చెం నాయుడు సమక్షంలో పార్టీ కండువా వేసుకున్నారు.

కోట్లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

నేడు ఉపాధ్యాయుల ర్యాలీ

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రభుత్వ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయం నుంచి నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి ఒక ప్రకటనలో తెలిపారు. పిఎఫ్, ఎపిఎల్, ఎపిజిఎల్ఐ, పిఆర్‌సి, డిఎ బకాయిలు చెల్లించాలని కోరుతూ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామని, ఉపాధ్యాయులు ఉదయం 10గంటలకు ఎంపిడిఒ కార్యాలయం వద్దకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

25న వైసిపి ఉత్తరాంధ్ర స్థాయి సమావేశం

ప్రజాశక్తి - బొబ్బిలి

భీమిలిలో ఈనెల 25న జరగనున్న ఉత్తరాంధ్ర రీజియన్ వైసిపి కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారు, ముఖ్య నేతలు సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

ముగిసిన గడువు

- ఆరేళ్లు పూర్తయినా కదలని పనులు
- శిథిల భవనంలోనే తహశీల్దార్ కార్యాలయం నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న రెవెన్యూ ఉద్యోగులు
- ముందే వచ్చేసిన ఫర్నీచర్

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక మండల తహశీల్దార్ నూతన కార్యాలయం పూర్తి చేసేదెప్పుడో అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పాత తహశీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిల వ్యవస్థలో ఉండటంతో నూతనంగా తహశీల్దార్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 2018 ఏప్రిల్ 22న టిడిపి హయంలో జిల్లా కలెక్టర్ ధనంజయ రెడ్డి ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ. 90 లక్షలతో పనులను ప్రారంభించారు. రాష్ట్ర ఇంధన శాఖ మంత్రిగా ఉన్న అప్పటి మంత్రి కిమిడి కళా వెంకటరావు కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. 9 నెలల్లో పనులు పూర్తి చేసి అన్ని రంగులతో అందించాలని అధికారులు, కాంట్రాక్టర్లకు జిల్లా కలెక్టర్ అప్పట్లో ఆదేశాలు జారీ చేశారు. అప్పటి పాలకొండ ఆర్‌డిఒ రెడ్డి గున్నయ్యకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఐదు నెలలు మాత్రమే పనులు చక చకా జరిగినప్పటికీ అనంతరం పరిణామాల దృష్ట్యా మందకొడిగా పనులు జరిగాయి. స్లాబ్ వరకు పూర్తి చేశారు. తరువాత ఎన్ఆర్ఇజిఎస్ నిధులు విడుదల కాకపోవటంతో కాంట్రాక్టర్ కొన్నేళ్లుగా పనులు నిలుపుదల చేశారు. నూతన తహశీల్దార్ కార్యాలయం నేటి వరకు పూర్తి కాకపోవటంతో శిథిలావస్థలో ఉన్న ఉన్న పాత తహశీల్దార్ కార్యాలయంలోనే అధికారులు, కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలం, ఎండలకు పెచ్చులు ఊడుతూ ఎప్పుడు కూలిపోతుందోనని భయబ్రాంతులతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో కంప్యూటర్ గదులు, పుస్తకాలు ఉంచు గదులు, ప్రాంగణాలు తడిసిపోవటంతో గదుల్లో ఉన్న దస్త్రాలు తడిసి ముద్దవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నూతన తహశీల్దార్ కార్యాలయం పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దృష్టి సారించి నూతన తహశీల్దార్ కార్యాలయం పనులు పూర్తి చేయించి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

మధ్యలో నిలిచిపోయిన తహశీల్దార్ కార్యాలయం నిర్మాణ పనులు

బిల్లులు చెల్లించకపోవడంతోనే నిలిచిపోయాయి

రేగిడి తహశీల్దార్ కార్యాలయానికి నిర్మాణ పనులలో భాగంగా కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించలేక నిర్మాణం పూర్తి కాలేదు. నిర్మాణ పనులకు రూ.90 లక్షలు ప్రతిపాదనలు చేశాం. రూ.67 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఇంతవరకు రూ.28 లక్షలు మాత్రమే బిల్లు చెల్లించాం. మిగతా రూ.39 లక్షలు కాంట్రాక్టర్‌కు ఇవ్వవలసి ఉంది. అయినా కాంట్రాక్టర్ ముందుకు వచ్చి పనులు చేశారు. బిల్లులు వచ్చాకే మిగతా పనులు పూర్తి చేస్తాం.

నాగభూషణరావు, ఆర్ అండ్ బి జెఇ, రాజాం

రెండేళ్లుగా ముందుకు కదలని పనులు

వేపాడ: మండలంలో ప్రధాన రహదారి సోంపురం జంక్షన్ నుండి వేపాడ మీదుగా ఆనందపురం జంక్షన్ వరకు గల రోడ్డుకు ప్రభుత్వం రెండేళ్ల క్రితం రూ. 39 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో కాంట్రాక్టర్ రోడ్డు పనులను ప్రారంభించారు. వల్లంపూడి గ్రామం నుండి వేపాడ గ్రామం మధ్య సుమారు అర కిలోమీటర్ రోడ్డు పనులు మధ్యలో నిలుపుదల చేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న గృహస్తులు వాడుక నీరు పైకి పోవడానికి వీలు లేకుండా పోయింది. ఫలితంగా రోడ్డుకు పడిన భారీ గుంతల్లో వాడుక నీరు నిల్వ ఉండి పోయి వాహనదారులు ప్రయాణించడానికి నరకయాతన పడుతున్నారు. జిల్లా అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జిల్లా పరిషత్తు, ప్రజా ప్రతినిధులు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డుకు పడిన గుంతల్లో ఇసుక, స్టోన్ క్రషర్ బుక్ వేసి తాత్కాలికంగా కప్పుతున్నారే తప్ప శాశ్వతంగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయడం లేదు. పనులు ప్రారంభించి రెండేళ్లవుతున్నా పనులు ఎందుకు పూర్తి చేయలేదని కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా చేసిన పనులకు బిల్లులు ఇవ్వలేదని అందుకే మిగతా పనులు చేయలేకపోతున్నామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రోడ్డు పనులు పూర్తి చేయాలని లేకపోతే రానున్న ఎన్నికల్లో ఏ విధంగా గుణపాఠం చెప్పాలో తమకు తెలుసునని ఆయా గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

చెరువును తలపిస్తున్న వేపాడ-ఆనందపురం రోడ్డు

లక్షింపేటలో అసిస్టెంట్ కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - వంగర

మండలంలోని లక్షింపేట గ్రామానికి చెందిన చిత్తిరి దుర్గాప్రసాద్ అనే దళిత యువకుడు బైక్ తాళం లాక్కొని, కొట్టడంతోపాటు కులం పేరుతో దూషించారంటూ ఫిర్యాదు చేయడంతో బిసి కులానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై వంగర పోలీస్ స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైన నేపథ్యంలో అసిస్టెంట్ కలెక్టర్ బి సహదీత్ వెంకట్ త్రివినాగ్, చీపురుపల్లి ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి లక్షింపేటలో గురువారం పర్యటించారు. ఈ కేసుకు సంబంధించి రాజాం రూరల్ సిఐ ఎస్ శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బిసి కులానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదయిందన్నారు. ఇప్పటికే వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. దర్యాప్తు జరుగుతుందని ఇది పూర్తయితే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. దీనికి ముందు అసిస్టెంట్ కలెక్టర్, ఆర్‌డిఒ దళితులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో బిసిలు, కక్షపూర్తిగా తమను ఇబ్బంది పెడుతున్నారని అందువల్ల ఇప్పటికే దళిత కుటుంబాలు రోడ్డున పడ్డాయని తమకు న్యాయం చేయాలని దళితులు అసిస్టెంట్ కలెక్టర్, ఆర్‌డిఒ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ చట్టం ప్రకారం న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్, ఎస్ఐ వై.వి జనార్ధన్, ఆర్ఐ జామి మురళి తదితరులు పాల్గొన్నారు.

యువకులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్, ఆర్‌డిఒ

పంచాయతీల అభివృద్ధిపై ప్రణాళికలు

ప్రజాశక్తి - భోగాపురం

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారంతో ముగిసింది. పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు గత రెండు రోజుల నుంచి ఈ శిక్షణా కార్యక్రమం జరుగుతోంది. సందర్భంగా ఎంపిడిఒ ఎన్ అప్పలనాయుడు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. పంచాయతీ స్థాయిలో గ్రామసభలు నిర్వహించుకొని ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలనే దానిపై చర్చించుకోవాలని తెలిపారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు కల్పించుకునేందుకు సర్పంచులంతా తగిన ప్రణాళికలను వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సురేష్, మండల విద్యాశాఖ అధికారి రమణమూర్తి, వైద్యాధికారి తిరుపతి స్వామి, ఎపిఒ ఆదిబాబు, ఎపిఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఎన్.అప్పలనాయుడు

అందరూ అభివృద్ధి చెందాలన్నదే లక్ష్యం

ప్రజాశక్తి- కొత్తవలస

ప్రతీ ఒక్కరూ అభివృద్ధి చెందడం ద్వారా భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యమని రాజ్యసభ ఎంపి జీవీఎల్ నరసింహారావు అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లిలో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశంలో అన్ని రంగాలలో మౌలిక వసతులు కల్పించడం, అభివృద్ధి చెందిన దేశంగా తయారు చేయటం ప్రధానమంత్రి ఆశయమని తెలిపారు. మేడిన్ ఇండియాలో భాగంగా మనకు కావలసిన వస్తువులను మనమే తయారు చేసుకునే విధంగా దేశాన్ని ముందుకి తీసుకువెళ్లేందుకు ప్రధాని కృషి చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విరోతి కొండలరావు, ఉప సర్పంచ్ అడ్డూరి సతీష్, ఎంపిడిఒ వై.పద్మజ, ఇఒపిఆర్‌డి కర్రి ధర్మారావు, పంచాయతీ కార్యదర్శులు జోగారావు, విశ్వనాదు కృష్ణారావు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి దాణేష్, ఉపాధ్యక్షులు చొక్కాకుల జగదీశ్వరి, నియోజకవర్గ కో కన్వీనర్ చొక్కాకుల అప్పారావు, నియోజకవర్గ మీడియా కన్వీనర్ వెంపల గోవింద, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు మాన్యం దేవుడు, విన్నకోట గణేష్, ములగపాక త్రినాధరావు, పి.శ్రీనివాసరావు, పి.చిరంజీవి, అధికారులు పాల్గొన్నారు.

కోలాటం చేస్తున్న మహిళలు

దుర్గాలమ్మ తీర్థంలో కోలాటం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయ గ్రామంలో దుర్గాలమ్మ మహోత్సవం సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గ్రామంలో డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ జాతర గ్రామ సర్పంచ్ ఎన్ వెంకటరావు, ఎంపిటిసి రాయవరపు రాజేష్, టిడిపి యువ నాయకుడు ఎన్ కామేష్, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

బొబ్బిలి: ఇపిఎఫ్ 95 పెన్షన్ దారులు కనీస పెన్షన్ రూ.9వేలకు పెంచాలని జనవరి 29, 30న న్యూఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేపడుతున్నామని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. శేషగిరి, పి. శంకర్రావు కోరారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం దేశంలో 70 లక్షల మంది ఉన్న ఇపిఎఫ్ 95 పెన్షన్ దారులకు తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. 2014 ఎన్నికల ముందు మోడీ పెన్షన్‌ను రూ.9వేలకు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటికి పది సంవత్సరాలు కావస్తున్నా అమలు చేయలేదన్నారు. పెన్షన్ దారులను మోసం చేసిన బిజెపిని ఓడించాలని ఢిల్లీలో జరిగే రెండు రోజులు ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. విలేకర్ల సమావేశంలో భుజంగరావు, టీబీ అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి సుధారాణి

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిపి అంబళ్ళ సుధారాణి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రామారావు అధ్యక్షతన 2024-25 ఆర్థిక సంవత్సరానికి గ్రామాభివృద్ధి పై సర్పంచులు, ఎంపిటిసి, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిచ్చి ప్రణాళికలు తయారు చేయాలని కోరారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యానికి లోటు రానీయకుండా చూడాలని, గ్రామాభివృద్ధికి అయ్యే ఖర్చులు పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.సింహాద్రి, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులు, అధికార్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

40 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని వెంకంపేట గ్రామానికి చెందిన బెల్ట్‌షాపు నడుపుతున్న వ్యక్తి 40 మద్యం బాటిల్‌తో గురువారం పోలీసులకు పట్టుబడ్డాడు. ఉంగరాడ మెట్ట నుంచి స్వగ్రామానికి వెంకంపేట అక్రమంగా మద్యం బాటిళ్లు తీసుకువెళ్ళడంతో దాడులు జరిపారు. అక్రమ మద్యం దారున్ని రేగిడి పోలీస్ స్టేషన్ తీసుకువచ్చారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసులు శివ, సుధీర్ పాల్గొన్నారు.

ఐదుగురు జూదారులు అరెస్టు

మండలంలోని అంబఖండి గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఈ శ్రీనివాసరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.19వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురిని పాలకొండ రిమాండ్‌కు తరలించామన్నారు.

కోడి పందేలపై దాడి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తిలో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురును వల్లంపూడి ఎస్ఐ రాజేష్ అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కోడిపుంజులను స్వాధీనం చేసుకునే కేసు నమోదు చేశారు. పాటూరులో జరుగుతున్న కోడిపందేలపై దాడి చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మొక్క జొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని ఎఒ ఎం. పూర్ణిమ సూచించారు. గురువారం మొయిద గ్రామంలో మొక్కజొన్న పంటను ఎఒ పరిశీలించి కత్తెర పురుగును గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు గుడ్లు గమనించిన వెంటనే ఎకరాకు వేప నూనె ఒక లీటర్, క్లోరోపైరిఫోస్ 500మిల్లి లీటర్ పిచికారీ చేయాలని సూచించారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఈమామెక్టిన్ బెన్జోయెట్ 80 గ్రాములు ఎకరాకు సాయంత్రం వేళలో మొక్క సుడిలో ఆకులు బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలని దీని ద్వారా కత్తెర పురుగు నివారణకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, విఎఎలు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న ఎఒ పూర్ణిమ

ముగిసిన మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలో గత వారం రోజులుగా జరుగుతున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ముగింపు వేడుకల్లో ఎంపిపి ఎన్ ఉమాలక్ష్మి, వైస్ ఎంపిపి సత్యనారాయణ, బొబ్బిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్ బి. శ్రీనివాసరావు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపిడిఒ ఎస్ రామకృష్ణ మాట్లాడుతూ 21 గ్రామ సచివాలయాల నుంచి క్రీడాకారులు పాల్గొని సత్తాను చాటి నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారన్నారు. వాలీబాల్ బాలుర జట్టుకు విజయరాంపురం, ఖోఖో బాలుర జట్టుకు నెమలాం, కబడ్డీ బాలికల జట్టుకు పెరుమాళి, బాలుర జట్టుకు పణుకువలస, బాడ్మింటన్‌లో బాలుర జట్టుకు పణుకువలస, బాలికల జట్టుకు వి.చిన్నయ్యపేట, క్రికెట్‌లో లోచర్ల జట్టు నియోజకవర్గ స్థాయికి అర్హత సాధించాయని తెలిపారు.

నియోజకవర్గానికి ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

గ్రామాల్లో డ్రోన్ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో సోంపురం, సింగరాయ గ్రామాల్లో భూముల సమగ్ర రీ సర్వే నిమిత్తం డ్రోన్ సర్వేను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఆయా గ్రామ సర్పంచులు మురిపిండి గంగరాజు, నిరుద్యోగి వెంకటరావు, మండల సర్వేయర్ అప్పలనాయుడు, సచివాలయ సర్వేయర్లు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలిస్తున్న నాయకులు

పరిశోధన పత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రతి అధ్యాపకుడు తప్పనిసరిగా పరిశోధనా పత్రాలు సమర్పించాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అన్నారు. పరిశోధన, పరిశోధనా పత్రాల తయారీ అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యశాలను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఉత్తమ నైపుణ్య విద్యలో సెంచూరియన్ విశ్వవిద్యాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. నాక్ ర్యాంకింగ్‌కు పరిశోధనా పత్రాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ విజయ్ బాబు, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డీన్లు ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ సన్నీడియోల్, ప్రొఫెసర్ మురళీ, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై సమీక్ష

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం కమిషనర్ శ్రీనివాసరావు అధ్యక్షతన నేటి నుంచి జరగనున్న కులగణనకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. వార్డు వాలంటీర్లు, సచివాలయాల సిబ్బందికి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు జారీ చేశారు. వాలంటీర్ యాప్‌లో సర్వే చేపట్టాలని, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలని, డేటా సబ్మిట్ చేయాలంటే కుటుంబ సభ్యుల్లో ఒకరి అంతేంటికేషన్‌తో పాటు వాలంటీర్, సచివాలయ సిబ్బంది అంతేంటికేషన్ తప్పనిసరి అని చెప్పారు. సిటిజన్ ఇకెవైసి కోసం బయోమెట్రిక్, ఒటిపి, ఫేస్, ఐరిష్ ఆప్షన్ ఇచ్చారని వాటిని వినియోగించుకోవాలని చెప్పారు. సుమారు పది రోజులు పాటు సర్వే ఉంటుందని ఈ సమయంలో కులగణన చేయించుకోలేని వారు సచివాలయానికి వెళ్లి వారి వివరాలను అందించవచ్చునన్నారు.

గ్రామాల్లో ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలు

ప్రజాశక్తి- బాడంగి

టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 28వ వర్ధంతిని మండలంలోని గజరాయనివలసలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎంపిటిసి పాలవలస గౌరు, సర్పంచ్ సత్తిబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, నాయకులు గొంప తులసి, సేనాపతి గణేష్, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక రామతీర్థం జంక్షన్, మొయిద జంక్షన్, జరజాపుపేటలో స్వర్గీయ ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా విగ్రహాలకు టిడిపి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. జరజాపుపేటలో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిడి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్, మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, పార్లమెంట్ అధికారి ప్రతినిధి గేదెల రాజారావు, నాయకులు బైరెడ్డి లీలావతి, లెంక అప్పలనాయుడు, అవనాపు సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

రామభద్రపురం: స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

బొబ్బిలి: టిడిపితోనే పేదలకు న్యాయం జరుగుతుందని మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా అన్నారు. పట్టణంలో గురువారం ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా దక్షిణ దేవుడి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: ఎస్‌కోట, కొత్తవలస జంక్షన్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్, కోళ్ల లలితకుమారి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరామ్ గురువారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కొత్తవలస పార్టీ కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శి కనకాల శివ ఆధ్వర్యంలో రక్తదాన శిభిరం నిర్వహించారు. చైతన్య బదిరుల పాఠశాలలో వికలాంగులకు అల్పాహారం అందజేశారు. నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌కోట టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, భీశెట్టి అరుణ, కోనేదం మల్లేశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, కరెడ్ల ఈశ్వరరావు, కొల్లి వెంకటరమణ మూర్తి, కొట్యాడ ఈశ్వరరావు, మళ్ళా రామకృష్ణ, జక్కాన కన్నబాబు, పిన్నింటి రమేష్‌నాయుడు, ఖాసాపేట సర్పంచ్ కోళ్ల భూపాల్‌నాయుడు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులు

బొబ్బిలి రూరల్ : ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం పక్కి గ్రామంలో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు నిర్వహించారు. ఆయన ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వేణుగోపాలనాయుడు, ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, చింతాడ సర్పంచ్ బంకురు తిరుపతిరావు, పూడి చిన్న తదితరులు పాల్గొన్నారు.

గుర్ల : మండలంలో ఎస్ఎస్ఆర్ పేటలో ఎన్‌టిఆర్ వర్ధంతిని మాజీ సర్పంచ్ కమ్మిండి శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వర రావు, రాష్ట్ర బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వెన్నె సన్యాసినాయుడు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి టి కిరణ్ కుమార్‌లు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం 100 మంది పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిల్ల అప్పలనాయుడు, నాగులపల్లి నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపిపి తాడ్డి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిన్నింటి సన్యాసినాయుడు, సుబ్బరాజు, కెంగువ ధనంజయ, చల్లా శ్రీరామ్, సీతారామ్, శివాజీ, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న వెన్నె సన్యాసినాయుడు

భోగాపురం: పోలిపల్లి గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఉపాధ్యక్షులు కోలా రామసూరి, క్లస్టర్ ఇన్చార్జులు దాసరి అప్పలస్వామి, పిడుగు తోటరావు, నాయకులు కర్రోతు రాజు, సరగడ తోగులు రెడ్డి, రౌతు రామకృష్ణ, కోరాడ తాతారావు, బొడ్డ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మండల కేంద్రంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంపడాంలో పేదలకు బట్టలు పంపిణీ చేశారు. వెంపడాపు సూర్యనారాయణ, వెంకటరమేష్‌నాయుడు ఆర్థిక సాయంతో పేదలకు బట్టలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు మహంతి చిన్నమనాయుడు, పతివాడ తమ్మి నాయుడు, దంగా భూలోక, మైలపల్లి సింహాచలం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి శంకర్రావు, నాయకులు ఆకిరి ప్రసాద్ రావు, విక్రమ్ జగన్నాథం, పసుపులేటి గోపి, పిన్నింటి సన్యాసినాయుడు, పిన్నింటి శ్రీనివాసరావు, ఇజ్జిరోతు ఈశ్వరరావు పాల్గొన్నారు.